ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం
26 ఫిబ్రవరి
2025



# గుట్టలో కన్నుల పండువుగా శివ పార్వతుల కల్యాణం

## పట్టు వస్త్రాలు సమర్పించిన అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శివరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. యాదగిరిగుట్ట ఆలయానికి అనుబంధంగా కొనసాగుతూ కొండపైన కొలువై ఉన్న పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి(శివాలయం) క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు మంగళవారం మూడో రోజు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం నిత్య హవనాలు, శివపంచాక్షరీ జపాలు, నందీశ్వర పారాయణాలు, పంచసూక్త పఠనాలు, మూలమంత్ర జపాలు జరిపారు. అనంతరం ఉదయం 10 గంటలకు రుద్రహవనం కైంకర్యాన్ని ఆలయ అర్చకులు శాస్త్రబద్ధంగా నిర్వహించారు. అనంతరం రాత్రి శివపార్వతుల కల్యాణ మహోత్సవం కన్నులపండుగగా నిర్వహించారు. రాత్రి 8 గంటలకు ప్రారంభమైన కల్యాణ మహోత్సవం దాదాపుగా రెండు గంటల పాటు వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా తెప్పించిన పూలతో శివపార్వతులను సర్వాంగ సుందరంగా అలంకరించారు. బంగారు ఆభరణాలు, వజ్ర వైఢూర్యాలు ధరించిన శివపార్వతులు భక్తులను తన్మయపర్చారు. నూతన వధూవరులుగా ముస్తాబైన ఆదిదంపతుల ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్టింపజేసి కల్యాణ ఘట్టాన్ని ఆరంభించారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, పారాయణికుల వేదపారాయణాలు, రుత్వికుల మూలమంత్ర, మూర్తిమంత్ర జపాల నడుమ, మంగళవాయిద్యాల కళతాళ ధ్వనుల మధ్య ముల్లోకాది దేవతలు చూస్తుండగా కైలాసవాసుడు పార్వతీ అమ్మవారి మెడలో మాంగళ్యధారణ చేసే తంతును అర్చకులు నయనానందకరంగా నిర్వహించారు. ఆ సమయంలో శివాలయ ప్రాంగణం "ఓం నమఃశివాయ, శంభోశంకర" నామస్మరణతో మార్మోగింది. సమస్త దేవతలు, మహర్షులు, ప్రకృతిలోని ప్రాణకోటి మొత్తం ఈ కల్యాణ వేడుకను తనివితీరా వీక్షించి పరవశించారని వేదపండితులు భక్తులకు ప్రవచించారు. శివాలయ ప్రధాన పురోహితులు గౌరీభట్ల సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో శివాలయ ప్రధానార్చకులు గౌరీభట్ల నరసింహారావు శర్మ కైంకర్యాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ దూర్బాల భాస్కర శర్మ, ఇన్చార్జి ఏఈ ధోర్బల శంకర్, వేద పండితులు కొత్తూరు శ్రీనివాస శర్మ శివాలయం అర్చకులు నరసింహమూర్తి సాయి ఋగ్వేద, యజుర్వేద, అధర్వణ, సామవేద పండితులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

### కళ్యాణంలో పాల్గొన్న రోమింగ్ న్యూస్ చీఫ్ ఎడిటర్ గొట్టిపర్తి దంపతులు

యాదాద్రి కొండపైన గల శ్రీ పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో రోమింగ్ న్యూస్ చీఫ్ ఎడిటర్ గొట్టిపర్తి భాస్కర్, ఎస్.వీ.ఎన్ ప్రిన్సిపాల్ గొట్టిపర్తి మాధురి, డైరెక్టర్ గొట్టిపర్తి వృతిక్ లు పాల్గొని తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అర్చకులు దంపతులకు ఆశీర్వచనం జరిపి శ్రీవారి శేష వస్త్రం ప్రసాదాన్ని అందజేశారు.









రోమింగ్ న్యూస్ చీఫ్ ఎడిటర్ గొట్టిపర్తి భాస్కర్,ఎస్.వీ.ఎన్ ప్రిన్సిపాల్ మాధురి, డైరెక్టర్ వృతిక్ లకు శివాలయ కళ్యాణంలో కంకణధారణ చేస్తున్న అర్చకులు















## గుట్టపై శివాలయంలో నేడు మహాన్యాస పూర్వక శతరుద్రాభిషేకం

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట కొండపైన గల శ్రీ పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉదయం నుండి సాయంత్రం వరకు లింగోద్భవునికి అభిషేకాలు, బిల్వార్చనలు జరపనున్నారు. రాత్రి లింగోద్భవ కాలంలో లింగమూర్తికి మహాన్యాస పూర్వక శతరుద్రాభిషేకం నిర్వహించనున్నారు. అభిషేకం టికెట్ ధర రూ.300, లక్షబిల్వార్చన టికెట్ ధర రూ.516, శతరుద్రాభిషేకం టికెట్ ధర రూ.516 గా నిర్ణయించారు. ఒక టికెట్ పై దంపతులిద్దరికి మాత్రమే ప్రవేశం ఉంటుందని ఆలయ ఆఫీసర్లు తెలిపారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు శివాలయానికి భక్తులు భారీగా పోటీ అయితే అవకాశం ఉన్నందున క్యూలైన్లను కూడా ఏర్పాటు చేశారు పోలీసులు బందోబస్తును పర్యవేక్షించనున్నారు.

